క్లుప్తంగా

శాంతి సౌభ్రాతృత్వాలకు ప్రతీక క్రిస్మస్



సింగంపల్లిలో క్రిస్మస్ కేక్‌ను కట్‌చేస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

రంగంపేట: శాంతి సౌభ్రాతృత్వాలకు క్రిస్మస్ పండగ ప్రతీక అని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండల పరిధిలోని సింగంపల్లిలో మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఐక్య క్రిస్మస్ వేడుకలకు ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ యేసు క్రీస్తు బోధించిన శాంతి మార్గంలో నడుచుకోవాలన్నారు. అనంతరం క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. మండల పాస్టర్స్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సత్కరించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, థామస్, చిట్టిబాబు, సాల్మన్‌రాజు, వివిధ గ్రామాల పాస్టర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పరామర్శ



వెంకటేష్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, గణేష్

సీతానగరం: పితృ వియోగంతో బాధపడుతున్న టీడీపీ మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్‌ను ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఉభయ గోదావరి జిల్లాల యువజన విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ బుధవారం పరామర్శించారు. వెంకటేష్ తండ్రి పెందుర్తి శ్రీరామచంద్రరావు ఇటీవల మృతి చెందారు. పెద్దకార్యం సందర్భంగా సీతానగరంలోని స్వగృహంలో ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, గణేష్ పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సింగవరంలో ఫ్యామిలీ డాక్టర్



సింగవరంలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రాజు

సీతానగరం: మండలంలోని సింగవరంలో బుధవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 467 మందికి సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు వైద్య సేవలందించారు. అవసరమైన పరీక్షలు చేసి, ఉచితంగా మందులను అందించారు. మంచంపై ఉన్న రోగుల ఇళ్లకు వెళ్లి వైద్యసేవలు అందించారు. ఎంపీపీ స్కూల్, అంగన్‌వాడీ సెంటర్‌ను సందర్శించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సౌజన్య, ఏఎన్‌ఎం అరుణ, ఆశావర్కర్లు స్వరాజ్యం, దేవి, విజయ పాల్గొన్నారు.

బాబా ఆలయంలో పూర్ణాహుతి

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి బాబా ఆలయంలో బుధవారం పూర్ణాహుతి హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ గురువు మామిడిపల్లి రామారావు, ఆలయ కమిటీ చైర్మన్ కంటే నాగ కేశవరావు ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ మూడు గంటల పాటు హోమం జరిగింది. దీనిలో భాగంగా బాబాకు భక్తులు సమర్పించిన శాలువాలకు వేలం నిర్వహించారు. అనంతరం భారీ అన్నసమారాధన జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు.

ఉత్సాహంగా వికసిత్ సంకల్పయాత్ర



నామవరంలో క్యాలెండర్ల పంపిణీ

రాజానగరం: కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తూ నిర్వహిస్తున్న వికసిత్ భారత్ సంకల్ప యాత్ర బుధవారం నామవరం, సంపత్ నగరంలో జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలలో ఎంపీడీఓ ఇన్‌చార్జి ఎం.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ అర్హత ఉండి ప్రభుత్వ పథకాలను పొందని వారు సమీపంలోని గ్రామ సచివాలయానికి వెళ్లి తమ వివరాలను నమోదు చేయించుకోవాలన్నారు. ప్రోగ్రాం జిల్లా కోఆర్డినేటర్ కాలెపు సత్యసాయి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటీవల ప్రారంభించిన విశ్వకర్మ యోజనలో అర్హులైన ప్రతి ఒక్కరూ తమ వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కరటూరు శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, అసెంబ్లీ కోఆర్డినేటర్ అడబాల గణపతి, మండల కన్వీనర్ పేపకాయల కాశీ పాల్గొన్నారు.

అనుకోని నష్టం రైతు దైన్యం

- మిచాంగ్ తుపానుతో తీవ్రనష్టం
- పంటనష్టం అంచనాలో అధికారులు
- భరోసా కల్పించిన ప్రభుత్వం



రఘుదేవపురంలో నీట మునిగిన వర్జీనియా పొగాకు

సీతానగరం: మిచాంగ్ తుపానుతో కురిసిన అధిక వర్షాలతో పంటలు పూర్తిస్థాయిలో ముంపుబారిన పడ్డాయి. చేతికందే సమయంలో నష్టాన్ని మిగిల్చాయి. పలు పంటలు నేలపాలవ్వగా, మరికొన్ని కుళ్లిపోయాయి. వర్జీనియా పొగాకు, మొక్కజొన్న, సెనగ, వరి పంటలకు, కూరగాయలు, పాదులు, మునగకు తుపాను నష్టం కలిగించింది. సీతానగరం మండలంలో 3 వేల ఎకరాల వరి, 2 వేల ఎకరాల వర్జీనియా పొగాకు, 2 వేల ఎకరాల మొక్కజొన్న, 1,035 ఎకరాల్లోని అరటి, కూరగాయలు, పాదులు, మునగ ముంపులోకి వెళ్లిపోయాయి.

పూర్తిస్థాయిలో నష్టం

సాంబమసూరి రకం వరిని తుపానుకు ముందు కోతలు జరిపి, అదే భూమిలో రెండో పంటగా మొక్కజొన్న వేశారు. నెల రోజులకే తుపాను రూపంలో రైతులను నష్టం ఏర్పడింది. పీఎల్ రకం వరికి కొంత కోతలు అవ్వగా, ధాన్యం రాశులు వర్షాలకు తడిచాయి. కొన్నిచోట్ల కోతలు జరపలేదు. ఆయా పొలాలు ముంపులోకి వెళ్లాయి. ఈదురు గాలుల కారణంగా వరి నేలను అంటింది. వర్జీనియా పొగాకు పది రోజులలో రెలుపుతో బేరన్లలో క్యూరింగ్‌కు సిద్ధమయ్యాయి. తుపాను కారణంగా వర్జీనియా పొగాకు రైతులు పూర్తి స్థాయిలో నష్టపోయారు.

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పర్యటన

మిచాంగ్ తుపానుతో సీతానగరం, కోరుకొండ మండలాల్లో ముంపుబారిన పడిన పొలాలను ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పరిశీలించారు. రైతులకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ఏ ఒక్కరూ అధైర్యపడవద్దన్నారు.



వంగలపూడిలో మొక్కజొన్న దుస్థితి

టుబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీధర్‌బాబును ఈనెల 9న తీసుకువచ్చి ముంపులో ఉన్న వర్జీనీయా పొగాకు పంటలను పరిశీలించారు. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదిక అందించి రైతులకు ప్రయోజనం చేకూర్చే విధంగా చర్యలు తీసుకుంటామని శ్రీధర్‌బాబు రైతుల్లో ధైర్యం నింపారు.

పంట నష్టం అంచనా

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పంటనష్టం అంచనా వేస్తున్నారు. ఈ సర్వేను ఈ నెల 18వ తేదీకి పూర్తి చేస్తారు. 18 నుంచి 22 వరకూ ఆయా ఆర్బీకేలలో పంటనష్టం జాబితాను ప్రదర్శనగా ఉంచుతారు. అందులో అభ్యంతరాలు ఉంటే వాటిని పరిశీలించి, తుది నివేదికను వ్యవసాయాధికారి ద్వారా ఈనెల 26న కలెక్టర్‌కు నివేదిక అందిస్తారు.



నాగంపల్లిలో ముంపులో ఉన్న వరి పంట

ప్రభుత్వం ఆదుకోవాలి



ఎనిమిదిన్నర ఎకరాల్లో వరి పంట వేశాను. తుపాను కారణంగా కోతలు నిలిపివేశాను. అధిక వర్షాలకు వరిచేను నేలకు అంటింది. అంతా నష్టమే. చేతికి ఒక బస్తా ధాన్యం రాని పరిస్థితి ఏర్పడింది. రూ.లక్షల్లో నష్టం కలిగింది. వడ్డీలకు తెచ్చి పెట్టుబడి పెట్టాను. ప్రభుత్వం ఆదుకోవాలి.

– సూలా దుర్గారావు, లంకూరు, కౌలు రైతు

పంట నష్టం అంచనా



ఆయా ఆర్బీకేల పరిధిలో విలేజ్ స్పెషల్ ఆఫీసర్, ఆర్ఐ, వీఆర్వో, వీఏఎలు పంటనష్టం అంచనా సర్వే నిర్వహిస్తారు. ఈనెల 18కి పూర్తి చేసి, ఆర్బీకేలోని నోటీసు బోర్డులలో పంటనష్టంపై నివేదిక ప్రదర్శనంగా ఉంచుతాం. అభ్యంతరాలు ఉంటే తెలియపర్చాలి.

– కె.సూర్య రమేష్, మండల వ్యవసాయశాఖాధికారి

ప్రతి ఒక్కరూ శాంతి, దయతో మెలగాలి



మాట్లాడుతున్న జక్కంపూడి విజయలక్ష్మి

మధురపూడి: ఏసుక్రీస్తు బోధించినట్టు ప్రతి ఒక్కరూ శాంతి, దయతో మెలగాలని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. కోరుకొండ మండలం పశ్చిమగానుగూడెంలో బుధవారం ఏఈఎల్‌సీ సెయింట్‌పాల్స్ చర్చి పునర్నిర్మాణానికి శంకుస్థాపన, జిల్లాస్థాయి సినెడ్ పాస్టర్స్ క్రిస్మస్ నిర్వహించారు. ఏఈఎల్‌సీ మోడ్రేట్ బిషప్ పరదేశిబాబు మాట్లాడుతూ బైబిల్ పఠనంతో శాంతి లభిస్తోందన్నారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన క్రైస్తవులతో సందడి నెలకొంది. కార్యక్రమంలో ఏఈఎల్‌సీ జిల్లా బిషప్ శామ్యూల్ రాజు, కృపారావు, మాణిక్యాలరావు, లూథర్ పెట్రిక్, పాస్టర్ కృపావిల్సన్, డెలిగేట్ గొల్లపల్లి ప్రవీణ్ కుమార్, కోశాధికారి ఇ.ఎజ్రా, వరధానం పాల్గొన్నారు.

ఉత్సాహంగా జాతర

పెదపూడి: గౌరి దేవి సాంబశివుడుల జాతర ఉత్సవాన్ని ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు ఉత్సాహంగా నిర్వహించాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. పెదపూడిలో గౌరీదేవి సాంబశివుడు జాతర మహోత్సవం బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి స్వామి అమ్మవారిని దర్శించుకున్నారు. సొసైటీ చైర్మన్ మార్ని కామరాజు చౌదరి, పద్మశాలీల సంఘం జిల్లా యువజన విభాగం కన్వీనర్, పార్టీ బీసీసెల్ మండల కన్వీనర్ పప్పు సింహాచలం, గ్రామ కన్వీనర్ మీసాల నాగరాజు పాల్గొన్నారు.

ప్రతిపక్షాలు ఆత్మపరిశీలన చేసుకోవాలి



రఘుదేవపురంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- రైతుల సంక్షేమానికి సీఎం జగన్ కృషి
- గడప గడపకూ‌లో ఎమ్మెల్యే రాజా

సీతానగరం: ప్రతిపక్ష పార్టీలు మాట్లాడేటప్పుడు ఒకసారి ఆత్మ పరిశీలన చేసుకోవాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా హితవు పలికారు. రఘుదేవపురంలో పల్లెనిద్ర అనంతరం బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు రైతులను నట్టేట ముంచాయన్నారు. రైతుల సంక్షేమ సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పని చేస్తున్న ప్రభుత్వం తమదన్నారు. టీడీపీ హయాంలో ఏవైనా ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే ఆ పార్టీ నాయకులు ఫొటోల ప్రచారానికి అధిక ప్రాధాన్యం ఇచ్చేవారని, బాధితుల గోడు పట్టించుకునేవారు కాదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రచారం ఆర్భాటానికి తావులేదన్నారు. తుపాను కారణంగా ఇళ్లు కూలిపోయిన, పడిపోయిన వారికి తక్షణమే ప్రభుత్వం సహాయం కింద రూ.10 వేలు అందించామని, ముంపు బాధితులకు బియ్యం, కందిపప్పు, నూనె వంటి నిత్యవసరాలు పంపిణీ చేశామన్నారు. టీడీపీ ప్రభుత్వం రఘుదేవపురంలో అభివృద్ధికి కేవలం రూ 1.20 కోట్లు చేర్చుపెడితే, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గడచిన నాలుగున్నరేళ్లలో రూ.20 కోట్లు పైబడి నిధులతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. సీఎం జగన్‌ను మరోసారి ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, సర్పంచ్ ఇందుగుమిల్లి చంద్రలీల, ఉప సర్పంచ్ పట్టపగల విష్ణు ప్రసాద్, పార్టీ నాయకులు చల్లమళ్ల సుజీరాజు, గెద్దాడ త్రిమూర్తులు, వెలమాటి కాశీ విశ్వనాథ్, చుంద్రు శ్రీను, నిడదవోలు శ్రీనివాస్, సుంకర సూర్యచంద్రం, పిండి రాధాకృష్ణ, దాసరి బాబీ పాల్గొన్నారు.

కట్నం కేసులో వ్యక్తికి జైలు

సీతానగరం: ఇనుగంటివారిపేటకు చెందిన గారపాటి సత్యనారాయణకు కట్నం వేధింపుల కేసులో ఏడాది, గృహహింసపై మరో ఏడాది జైలు శిక్ష విధిస్తూ ఏడో అదనపు ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ పి.బాబు తీర్పు ఇచ్చారని ఎస్సై కె.చిరంజీవి బుధవారం తెలిపారు. 2019లో గారపాటి ప్రశాంతి ఫిర్యాదు మేరకు ఆమె భర్త సత్యనారాయణపై కట్నం వేధింపుల కేసు నమోదైంది. విచారణ అనంతరం న్యాయమూర్తి వైవిధంగా తీర్పునిచ్చారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఓలేటి మహాలక్ష్మి వ్యవహరించారు.

మత్తుకు బానిసలు కావొద్దు

మధురపూడి: విద్యార్థులు రేపటి సమాజ నిర్మాతలని, మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని సెబ్ కోరుకొండ సీఐ జి.సత్యనారాయణ అన్నారు. కోరుకొండ మండలం రాఘవపురం హైస్కూల్లో బుధవారం కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఎం అన్నపూర్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువత చెడు సహవాసాలకు దూరంగా ఉండాలన్నారు.

పంట నష్టంపై సర్వే

రంగంపేట: మిచాంగ్ తుపానుతో పంట నష్టాలతో ఆందోళన చెందుతున్న రైతులకు సత్వర న్యాయం అందించే లక్ష్యంతో ప్రభుత్వ యంత్రాంగం చర్యలు చేపట్టింది. పంట నష్టపోయిన ప్రతీ రైతును ఆదుకోవాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో ఉద్యానవన శాఖ అధికారులు రెండు రోజులుగా పంట నష్టాలపై క్షేత్రస్థాయిలో సర్వేకు శ్రీకారం చుట్టారు. మండల ఉద్యాన వన అధికారి కె.దివ్యశ్రీ ఆధ్వర్యంలో సిబ్బంది మండలంలోని రంగంపేట, సింగంపల్లి, వడిశలేరు, సుభద్రంపేట, దొడ్డిగుంట గ్రామాల్లో కూరగాయలు, దుంప, మిరప పంటలను పరిశీలించారు. నష్టం వివరాలను అధికారులు నమోదు చేస్తున్నారు. నష్ట నివేదికను ప్రభుత్వానికి అందజేయనున్నట్టు ఉద్యాన వన అధికారి దివ్యశ్రీ తెలిపారు. ఉద్యాన విస్తరణ అధికారి ఆర్.అరవింద్ సాయి, గ్రామ ఉద్యాన వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.



సింగంపల్లిలో తుఫాన్‌కు దెబ్బతిన్న బీరపాదులను పరిశీలిస్తున్న అధికారులు.

ధన్యవాదాలు

సీతానగరం: కడియం రైల్వే స్టేషన్ అడ్వైజరీ బోర్డు మెంబర్‌గా తనను నియమించడానికి కృషి చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు దగ్గుపాటి పురందేశ్వరి, కేంద్ర కార్యవర్గ సభ్యులు సోము వీర్రాజు, జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, రాజానగరం అసెంబ్లీ కన్వీనర్ నీరుకొండ వీరన్న చౌదరిలకు ధన్యవాదాలని మిర్తిపాడుకు చెందిన నల్లజర్ల నరేష్ తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఎంతో నమ్మకంతో అప్పగించిన పదవికి న్యాయం చేస్తానన్నారు.

ఎస్సీలకు పొజిషన్ సర్టిఫికెట్ల పంపిణీ



పొజిషన్ సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

రంగంపేట: గత 38 ఏళ్లుగా నివాసం ఉంటున్న ఎస్సీల కల ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సాకారం చేశారు. మండల పరిధిలోని కోటపాడులోని డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ పౌల్ట్రీ కాంప్లెక్స్‌లో 60 మంది ఎస్సీ సామాజిక వర్గం వారు ఎప్పటి నుంచో నివాసం ఉంటున్నారు. అయితే వారు ఉంటున్న భూమిపై వారికి ఎటువంటి హక్కులు లేకపోవడంతో భూమికి హక్కులు కల్పించి పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేయించి బుధవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ 38 ఏళ్లుగా నివాసం ఉంటున్నా భూమిపై ఏవిధమైన హక్కులు లేకుండా ఉంటున్నారని ఈ విషయం తన దృష్టికి వచ్చిందని వెంటనే జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్లలతో సంప్రదించి వారి సమస్యకు పరిష్కారం ఆలోచించి వారందరికీ పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేయించి అందించానన్నారు. లబ్ధిదారులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు, జిల్లా పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయేలు, రాష్ట్ర చేనేత, రైతు విభాగాల కార్యదర్శులు పాలాటి నాగేశ్వరరావు, రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, సర్పంచ్ గవరసాని లక్ష్మీదుర్గ, ఎంపీటీసీ సభ్యుడు సుంకర అప్పారావు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం

రంగంపేట: రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిని చేయాలి అని జిల్లా పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న పిలుపునిచ్చారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం మండల పరిధిలోని చంద్రేడు గ్రామంలో బుధవారం గ్రామ సర్పంచ్ జాస్తి వెంకట పద్మావతి ఆధ్వర్యంలో స్థానిక సచివాలయం వద్ద జరిగింది. ఈ సందర్భంగా చంద్రన్న మాట్లాడుతూ అభివద్ధి, సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమన్నారు. 2024లో ఎన్నికల్లో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి పట్టం కట్టాలన్నారు. అనంతరం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత అందించిన సంక్షేమ, అభివృద్ధి పథకాల ద్వారా జరిగిన లబ్ధిని ప్రజా ప్రతినిధులు వివరించారు. సంక్షేమ పథకాల బోర్డును ప్రజా ప్రతి నిధులు, నాయకులు ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ జెండాను మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయిల్, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, మండల జేఏసీ కన్వీనర్ మేడిశెట్టి రవిశంకర్, ఎంపీటీసీ సభ్యులు కంటిపూడి శేషారత్నం పాల్గొన్నారు.



కొంకుదురులో సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రగతి పథంలో రాష్ట్రం

బిక్కవోలు: జగనన్నతోను సంక్షేమం అని నియోజక వర్గం ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ అన్నారు. బుధవారం మండలంలోని కొంకుదురు సచివాలయం–2 వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సచివాలయాల వద్ద అధికారులు, సచివాలయ సిబ్బంది, నాయకులు కలిసి సంక్షేమ పథకాల లబ్ధిని తెలియజేసే డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. పార్టీ జెండాను ఎగుర వేశారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రం ప్రగతిపథంలో పయనిస్తుందని, సంక్షేమ ఫలాలు అన్ని వర్గాలకు చేరువుతాయన్నారు. ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని తెలియజేశారు. రాష్ట్రానికి మళ్లీ వైఎస్ జగన్ ఎందుకు సీఎం కావాలో వివరించారు. సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగన్‌కు వచ్చే ఎన్నికల్లో ప్రజలంతా మద్దతుగా నివాలని కోరారు. సర్పంచ్ సత్తి వీరమణి, ఎంపీటీసీ సభ్యులు కొంకుదురు పివి, నల్లమిల్లి అమ్మిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు సత్తి నాగిరెడ్డి రాజా, ఈవోపీఆర్డీ భవాని పాల్గొన్నారు.



చంద్రేడులో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న అధికారులు, నాయకులు

వ్యక్తి అరెస్టు

సీతానగరం: ముగ్గళ్లకు చెందిన గోరుముచ్చు వీరాస్వామి (మల్లారం)ని అరెస్ట్ చేసి, అతడి నుంచి పది లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామని ఎస్ఈబీ సీఐ జి.సత్యనారాయణ బుధవారం తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేశామని, కోర్టులో హాజరుపర్చుతామన్నారు.

ఆలయాల హుండీలు లెక్కింపు

బిక్కవోలు: స్థానిక ప్రాచీన ఆలయాల హుండీలను లెక్కించినట్లు ఈవో రాంబాబురెడ్డి బుధవారం తెలిపారు. బిక్కవోలు శ్రీ లక్ష్మీ గణపతి ఆలయ హుండీ ద్వారా రూ.9,65,252, అన్నదానం హుండీ నుంచి రూ.1,09,871 వచ్చిందన్నారు. శ్రీగొలింగేశ్వరస్వామి ఆలయం హుండీ లెక్కించగా రూ.2,93,547 వచ్చిందన్నారు.

వినతిపత్రం అందజేత

సీతానగరం: తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ మండల ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం ఎంపీడీవో కె.రమేష్‌కు వినతిపత్రం అందించారు. యూనియన్ మండల ఉపాధ్యక్షుడు సుంకవల్లి పోశారావు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. జిల్లా యూనియన్ అధ్యక్షుడు కోడెల్లి ప్రకాష్ మాట్లాడుతూ ఈనెల 18న చలో కలెక్టరేట్, 2024 జనవరి 5న చలో విజయవాడ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

డిమాండ్లు నెరవేర్చాలి

పెదపూడి: అంగన్‌వాడీ కార్యకర్తలకు డిమాండ్లు నెరవేర్చాలని అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్ల మండలశాఖ కమిటీ కన్వీనర్, కాకినాడ జిల్లా ఆఫీస్ బేరర్ మిరియాల రాజేశ్వరి డిమాండ్ చేశారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం అంగన్‌వాడీలు నిరవధిక సమ్మె ప్రారంభించారు. యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సాహిత్య, కళారంగాలకు నిస్వార్థ సేవలు

అనపర్తి: గ్రామంలో తన తండ్రి నెలకొల్పిన గంగిరెడ్డి గ్రంథాలయ నిర్వహణను కొనసాగించడంతో పాటు సాహిత్య, సాంస్కృతిక, కళారంగాలకు ద్వారంపూడి శ్రీశ్చంద్రారెడ్డి(లైబ్రరీ అబ్బాయి) నిస్వార్థంగా సేవలందించారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. లైబ్రరీ అబ్బాయి 106వ జయంతి వేడుకలు స్థానిక పాల్ట్రీ అసోసియేషన్ సెమినార్ హాలులో బుధవారం నిర్వహించారు. లైబ్రరీ అబ్బాయి చిత్రపటానికి ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొని ఎమ్మెల్యే మాట్లాడుతూ అనపర్తి, పరిసర గ్రామాలకు చెంది ఉన్నత స్థానాల్లో స్థిరపడిన ఎంతోమంది విజయంలో గంగిరెడ్డి గ్రంథాలయ కీలకపాత్ర పోషించిందన్నారు. అనపర్తి పరిధిలో గల జగనన్న కాలనీలో ఒక వీధికి లైబ్రరీ అబ్బాయి పేరు పెట్టేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. భాగంగా లైబ్రరీ అబ్బాయితో అనుబంధం కలిగిన ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ తేతలి సత్యనారాయణరెడ్డిని ఎమ్మెల్యే సత్కరించారు. తేతల త్రినాథరెడ్డి, మారెళ్ల గంగరాజుశర్మ, ద్వారంపూడి పాండురంగారెడ్డి, కర్రి సాంబశివారెడ్డి, నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి, మల్లిడి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



లైబ్రరీ అబ్బాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి తదితరులు

ఘనంగా సహస్ర దీపోత్సవం

పెదపూడి: ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక భావాలు పెంపొందించుకుని ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఉత్సాహంగా చేపట్టాలని సంపర గ్రామంలోని ముక్తేశ్వర స్వామి అన్నారు. సంపర శివారు ముక్తేశ్వర గ్రామంలో శ్రీ బాలాత్రిపుర సుందరీ సమేత ఈక్షణ ముక్తేశ్వరస్వామివారి ఆలయంలో బుధవారం సహస్ర దీపోత్సవం నిర్వహించారు. భక్తులు కార్తిక దామోదర పూజలు చేశారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ ఖండవిల్లి హనుమంతాచార్యులు, ఈఓ సీహెచ్‌వీ రమణమూర్తి పాల్గొన్నారు.

కార్తికానికి వీడ్కోలు

బిక్కవోలు : కార్తిక మాసం ముగింపు సందర్భంగా బుధవారం తెల్లవారు జామున భక్తురాలు పోలమ్మ (పోలి) స్వర్గం పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజాము3 గంటల నుంచి కాలువరేవుల వద్ద సందడి నెలకొంది. మహిళలు పుణ్యస్నానాలు చేసి కార్తిక దీపాలను వెలిగించి నీటిలో వదిలారు. రావిచెట్టు, తులసికోటల వద్ద పూజలు చేశారు. కొంకుదురు తిముఖలింగేశ్వరుడు ఆలయంలో 18 రకాల ఫలాలలో స్వామి వారికి అభిషేకాలు చేశారు. అనంతరం ప్రత్యేకగా పూలతో స్వామివారిని అలంకరణ చేశారు. బిక్కవోలు గోలింగేశ్వరస్వామి, బలభద్రపురం ఉమారామలింగేశ్వరుడు, ఊలపల్లిలో వేణుగోపాలస్వామి, అగేస్త్వేరస్వామి, కొంకుదురు బుడితలమామిడి వద్ద త్రిముంఖగేశ్వరుడు, తోస్సిపూడి, కొమరిపాలెం, ఆరికరేవుల గ్రామాలో భక్తులతో కిటకిటలాడాయి.



కొంకుదురులో దీపాలు వదులుతున్న భక్తులు



ఆస్పత్రి వద్ద మురుగు కాలువలోకి వెళ్తున్న నీరు

నీటి వృథా ఆగేదెలా..

రాజానగరం: దివాన్‌చెరువులో జాతీయ రహదారి జంక్షన్ నుంచి పాలచర్లకు వెళ్లే రోడ్డులో ఉన్న ప్రైవేట్ ఆస్పత్రి వద్ద కుళాయి నీరు పైపులు చిట్లిపోయి ధారాళంగా కారుతూ మురుగు కాలువలోకి పోతున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. ఈ ప్రాంతంలోనే మరొకరి ఇంటి వద్ద ఉన్న కుళాయిలు పగిలిపోయి నీరు వృథా అవుతుంది. దీనికి ఎదురుగానే గ్రామ సచివాలయం ఉంది. కానీ ఎవ్వరూ ఈ సమస్యను పట్టించుకోవడం లేదు.



ఇంటి వద్ద కుళాయి పైపులు పగిలి వృథాగా పోతున్న నీరు